క్లుప్తంగా

జూదరుల అరెస్ట్
పెద్దమండ్యం: ఎనిమిది మంది జూదరులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి. వెంకటేష్ తెలిపారు. మండలంలోని వెలిగల్లు పంచాయతీ కాయలపల్లెకు సమీపంలో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో ఎనిమిదిమంది జూదరులు పట్టుబడగా, వీరి నుండి రూ.8200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు
ములకలచెరువు: ఏఎన్ఎంలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని ప్రభుత్వ డాక్టర్ జాహ్నవిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలతో డాక్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో పర్యటించి జ్వరం, ఇతర వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

రాయితీ యంత్రాలను సద్వినియోగం చేసుకోండి
వాల్మీకిపురం: ప్రభుత్వం అందించే రాయితీ యంత్రాలను సద్వినియోగం చేసుకుని రైతులు లబ్ధిపొందాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు నీరజ అన్నారు. మంగళవారం స్థానిక పశు సంవర్ధకశాఖ ఆసుపత్రి ఆవరణంలో సర్పంచ్ గంగులమ్మ, ఆర్బీకే చైర్మన్ నీళ్లభాస్కర్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డిలతో కలసి ఆరు యంత్రాలను రైతులకు రాయితీపై పంపిణీ చేశారు.

గర్భిణులను జాగ్రత్తగా చూసుకోవాలి
కురబలకోట: గర్భిణుల ఆరోగ్య స్థితి గతులపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటి డీఎం అండ్‌హెచ్‌ఓ లక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాతృత్వం జీవితంలో మరుపురాని తీపి గుర్తు అన్నారు. ముఖ్యంగా ఇబ్బందులు పడుతున్న గర్భవతుల పట్ల మరింత జాగ్రత్త వహించాలన్నారు. అవసరమైన వారిని ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు.

పనులు వేగవంతం చేయాలి
పెద్దమండ్యం: గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పీఆర్ డీఈ విజయమోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులను కేటాయించినట్లు తెలిపారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు ఎంపిక చేసిన గ్రామాలలో ప్రజాప్రతినిధులు వెంటనే కేటాయించిన నిధులతో పనులు వేగవంతం చేయాలని కోరారు. అలాగే గ్రామ సచివాలయాల వారీగా సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ సమీక్షించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పీరమ్మ, డెప్యూటి తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, విశ్వనాథ, బాషా, విశ్వనాథరెడ్డి, పద్మావతమ్మ, విజయకుమారి, ఎంపీటీసీ సభ్యులు జయరాం, వీఆర్‌వోలు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలపరిశీలన
రామసముద్రం : నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంగళవారం మదనపల్లె విద్యుత్‌శాఖ ఈఈ రాజశేఖర్‌రెడ్డి స్థలపరిశీలన చేశారు. పెద్దకురప్పల్లె పంచాయతీ మట్లవారిపల్లె సమీపంలోని ఓబులనాయునిపల్లె బస్టాప్, బసవన్నకట్ట వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. సుమారు రూ.1.50 కోట్లతో 33/11 కే.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈ మస్తాన్, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, వీఆర్వో రెహమాన్, వీఆర్ఏ హరి, విజయకుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ సంఘం మండల కమిటీ ఎంపిక



కలికిరి: తొగటవీర క్షత్రియ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో మండల అధ్యక్షుడుగా మోడెం నాగరాజ, ప్రధాన కార్యదర్శిగా మోడెం శంకర, ట్రెజరర్‌గా రఘురాం, గౌరవ సలహాదారులుగా జి.వెంకటరమణ, టైలర్ వెంకటరమణ, పి.లక్ష్మీనారాయణ, పురం వెంకటనారాయణ, మోడెం వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా పుర్రు రెడ్డిశేఖర, శ్రీనివాసులు, జయరాం, గురుమూర్తి, జాయింట్ సెక్రటరీలుగా చంద్రశేఖర్, సహదేవ, మోహన, ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా పి.శంకర, శేఖర, హరి, నాగరాజ, ధనుంజయలను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆ సంఘం నేతలు సూచించి, ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి వెంకటేష్, రామాంజులు, రామచంద్ర, రమణ, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ.. చల్లంగా చూడవమ్మా



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బోనాలు తీసుకు వస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ: గంగమ్మ.. చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీ నల్లవీర గంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి తిరుణాల ఘనంగా జరిగింది. ఆలయం విద్యుత్ వెలుగుల మధ్య వెలిగిపోయింది. ధగధగలాడే అలంకరణలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వెరసి జాతర వైభవంగా జరిగింది. ఓ వైపు అమ్మవారికి అర్చకులు పూజలు చేస్తుండగా... మరో వైపు ఉత్సాహంతో జనం జాతరలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి సీటీఎం, కొత్తవారిపల్లె, దుబ్బిగానిపల్లె, సీటీఎం క్రాస్ పంచాయతీలకు చెందిన మహిళలు ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి చీర, సారెలను అందజేశారు. ఆలయం ధ్వజస్తంభం ఎదుట జంతు బలి ఇచ్చారు. ఆసాదివారు అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. ఆలయం ప్రాంగణంలో దుకాణాలు వెలిశాయి. చిన్నపిల్లల కోసం జెయింట్‌వీల్, డ్రాగన్‌ట్రైన్, కొలంబస్, రంగులరాట్నం వంటి పరికరాలు ఏర్పాటు చేశారు. జాతర పురస్కరించుకుని అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల నుంచి చాందినీ బండ్లు ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చాందినీ బండ్లు చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో పాటు టెంకాయ బండ్లు, అన్నం బండ్లు ఆలయం చుట్టూ తిప్పారు. భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపారు. తాలూకా సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా పుష్పయాగం
రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్దన స్వామి బ్రహ్మ రథోత్సవంలో భాగంగా మంగళవారం స్వామివారికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకు మార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టార్, కులశేఖర్ భట్టార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



పుష్పయాగంలో శ్రీలక్ష్మీజనార్ధనస్వామి

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శిక్షణ
కలికిరి: కృషి విజ్ఞాన కేంద్రంలో డా.వైఎస్సార్ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ బయన్న పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్ స్థల పరిశీలన
పెద్దతిప్పసముద్రం: కందుకూరు సమీపంలో జగనన్న లే అవుట్ స్థలాన్ని మంగళవారం ఎంపీపీ మహమూద్, తహశీల్దార్ విద్యాసాగర్, సర్పంచ్ రహ్మతుల్లా, కన్వీనర్ సుబ్బరాం, ఎంపీటీసీ కేశవ్, వీఆర్వో శ్రీరాములు పరిశీలించారు. లే అవుట్‌ను వేగవంతంగా చదును చేయించి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయిస్తామని అధికారులు పేర్కొన్నారు.

పరామర్శ
కేవీపల్లె : తువ్వపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ మదనమోహన్‌రెడ్డి (65) అనారోగ్యంతో బెంగుళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం తువ్వపల్లెకు చేరుకుని మదనమోహన్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

బద్దిరెడ్డిగారిపల్లెకు నీరు అందించండి
కలకడ : బద్దిరెడ్డిగారిపల్లె కు నీరు అందించాలని ఎంపీపీ శ్రీదేవి ఆదేశించారు. మంగళవారం సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో పాఠశాల తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం సచివాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బద్దిరెడ్డిగారిపల్లెలో నీటి సమస్య ఉన్నట్లు గ్రామస్తులు తెలియజేయడంతో సింటెక్స్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని మండల పరిషత్ నిధులతో మంజూరు చేయాలని ఎంపీడీఓ నారాయణకు సూచించారు. ఎంఈఓ మునీంద్రనాయక్, ఎఈ ఇరగన్న పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన
నిమ్మనపల్లె : రెడ్డివారిపల్లె పంచాయతీ యర్రాతివారిపల్లెలో జరుగుతున్న మురుగునీటి కాలువ నిర్మాణపనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సురేష్ మంగళవారం పరిశీలించారు. స్థానిక సర్పంచ్ రెడ్డెమ్మ, ఎంపీడీఓ లీలామాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు నరేంద్రరెడ్డితో కలిసి పనులను తనిఖీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథరెడ్డి, హౌసింగ్ ఏఈ అమరనాథ్, కార్యదర్శి మారెప్ప పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో ఆశా కార్యకర్తలు కీలకం
నిమ్మనపల్లె : ప్రజారోగ్యం మెరుగుపరచడంలో ఆశా కార్యకర్తలు కీలకంగా పనిచేయాలని మెడికల్ ఆఫీసర్ జులేఖాబేగం అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా స్థాని క పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏఎన్ఎంలకు మొబైల్ సిమ్‌కార్డులు పంపిణీ చేశారు.

కబడ్డీ టోర్నమెంట్ విజేత సదుం జట్టు
పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బీజేవైఎం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మోడీ కబడ్డీ టోర్నమెంట్ విజేతగా సదుం జట్టు నిలిచింది. మంగళవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. సదుం జట్టు మొదటి స్థానం సాధించి రూ. 15 వేలు బహుమతి సొంతం చేసుకుంది. ద్వితీయ స్థానం సాధించిన ఏజీపల్లెకు రూ. 10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన పీలేరు సీఎస్ఆర్ కళాశాల జట్టుకు రూ. 5వేలు నగదు బహుమతి తోపాటు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్రకుమార్‌రెడ్డి హాజరయ్యారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి
పెద్దతిప్పసముద్రం: మండలంలోని కాట్నగల్లు సచివాలయాన్ని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ పరిధిలో పని చేసే వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్, ఏఎన్ఎంలు చేపడుతున్న సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు) సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

త్వరలో శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ

– టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్.

మదనపల్లె : పట్టణంలో శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం త్వరలో వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, స్థానిక బలిజ సేవాసంఘం నాయకులతో కలిసి విగ్రహ ఏర్పాటు చేయనున్న వేదికను, స్థలాన్ని పరిశీలించారు. విగ్రహావిష్కరణకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారం మరువలేనిదన్నారు. బలిజ సేవా సంఘం విగ్రహ ఏర్పాటుకు సహకరించాల్సిందిగా ఎంపీ మిథున్‌రెడ్డిని కోరిన వెంటనే ఆయన తన సొంత నిధులతో విగ్రహాన్ని సమకూరుస్తానని చెప్పి, అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహావిష్కరణ తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. రూ.20 లక్షల వ్యయంతో పట్టణ నడిబొడ్డున శ్రీ కృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్టణ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా బలిజ సంఘం యువజన అధ్యక్షులు బండ్ల లక్ష్మీపతి, బలిజ సేవా సంఘం నాయకులు విజయలక్ష్మీ భాస్కర, ఆర్.ఆర్.రామాంజులు, గాజుల భాను, ఆవుల సూరి, వేణు, రాజ్‌భవన్‌రాజా, డిపార్ట్‌మెంట్ శ్రీనివాసులు, దేవళం వీధి నాగేంద్ర, మంజు, గిరి, లక్ష్మీ నారాయణ, ఆనంద, నాగరాజు, పగడాల సూరి, టీఎస్ఏ.కృష్ణమూర్తి, బలిజ జేఏసీ అధ్యక్షులు వైఎస్.మునిరత్నం, అండేశివ, ఆకుల కృష్ణమూర్తి, ప్రసాద్, నరిబాబాయ్ పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాటు స్థలంలో బలిజ సేవా సంఘం సభ్యులతో టీటీడీ బోర్డు మెంబర్ అశోక్‌కుమార్

10న రాయల విగ్రహ ప్రతిష్ట భూమి పూజ
మదనపల్లె : మండలంలోని బసినికొండ గ్రామపంచాయతీ బైపాస్‌రోడ్ వై జంక్షన్‌లో శ్రీ కృష్ణ దేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు ఈనెల 10న భూమిపూజ నిర్వహిస్తున్నట్లు మదనపల్లె బలిజ జేఏసీ తెలిపింది. మంగళవారం శ్రీరామ తులసీకల్యాణ మండపంలో మదనపల్లె బలిజ జేఏసీ కమిటీ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారంతో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని బసినికొండ వై జంక్షన్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. దీనికి ఎంపీ, ఎమ్మెల్యేలు తమ సమ్మతిని తెలిపి ఈనెల 10న విగ్రహప్రతిష్ఠకు భూమిపూజ ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఆదేశిస్తూ.. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారన్నారు. సమావేశంలో మదనపల్లె బలిజ జేఏసీ అధ్యక్షులు వైఎస్.మునిరత్నం, ఆర్‌టీకే చైర్మన్ కత్తిరాజు, అండేశివ, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, ప్రసాద్, రామచంద్ర, హరి, మంజునాథ్, రామమూర్తి పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పేదల అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణం 5వ గ్రామ సచివాలయం పరిధిలో రాజీవ్‌నగర్ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఏదోవిధంగా ప్రభుత్వం నుంచి రూ. లక్ష నుంచి రూ. 12 లక్షల వరకు లబ్ధి పొందారని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కొత్త పథకాలు తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా నిలిచారని తెలిపారు. విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత కలిప్తున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అర్హతగల వారికి మూడో విడతలో ఇళ్ల పట్టాలు అందిస్తామని చెప్పారు. మండలంలో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో పీలేరును మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, వైస్ ఎంపీపీలు ఎస్.వి. చలపతి, హరిత, ఎంపీటీసీ జోహార్, నాయకులు కాలనీ చిన్న, నాగరాజ నాయక్, కళావతి, హుమయూన్, మునీర్, వీరమోహన, ఆయాసాబ్, అయాత్, శ్రీనాథరెడ్డి, జయపాల్ రెడ్డి, ఖాదర్ బాషా, రవి, మహితా ఆనంద్, ఉదయ్, పెద్దోడు పాల్గొన్నారు.



పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

నాణ్యమైన భోజనం అందించాలి

గుర్రంకొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజ నం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిటి చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చికెన్, కోడిగుడ్లు మెనూ ప్రకారం అందిస్తున్నారని విద్యార్థులు అన్నారు. స్టోర్ రూమ్‌కు వెళ్లి సరుకులను పరిశీలించారు. హాస్టల్ రికార్డులను, స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. డీఎస్‌డబ్ల్యుఓ జాకీర్, వార్డెన్ శంకరయ్య పాల్గొన్నారు.

కురబలకోట: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సి. విజయ్ ప్రతాప్ రెడ్డి మంగళవారం సాయంత్రం కురబలకోట మండలం చేనేతనగర్ లోని బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖా ముఖి నిర్వహించారు. భోజనం బాగుందా.. రుచికరంగా వడ్డిస్తున్నారా..లేదా.. నిర్భయంగా చెప్పండి అని ఆరా తీశారు. భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించారు. సమస్యలుంటే పరిష్కరిస్తానని చెప్పారు. బయటకు చెప్పలేకపోతే పేపర్లో రాసివ్వాలని సూచించారు. సెల్ నెంబరు కూడా ఇచ్చారు. విద్యార్థుల నుండి లిఖిత పూర్వకంగా వారి అభిప్రాయాన్ని తీసుకున్నారు. వంట గదిని, స్టోర్ రూమ్‌లో సరుకులను పరిశీలించారు. భోజనం బాగుంది..నిర్వహణ బాగుందని పలువురు విద్యార్థులు చెప్పడంతో ఆయన కూడా ప్రిన్సిపాల్ ఎస్.నిర్మలకు ఆల్‌ది బెస్ట్ అని చెప్పారు.



గుర్రంకొండలో ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసి వార్డెన్‌కు సూచనలిస్తున్న విజయప్రతాప్ రెడ్డి

కలకడ : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం గుడిబండ పంచాయతీ చొక్కన్నగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, నాణ్యత, రుచి చూశారు. అనంతరం కలకడ ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాము, సివిల్‌సప్లై డీటీ వెంకటరెడ్డి, సీడీపీఓ భారతి, ఏసీడీపీఓ క్రిష్ణమంజరి, సూపర్‌వైజర్ యశోద, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ
ములకలచెరువు: పెద్దపాళ్యం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ వెంకటరమణ మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ట్యాబ్‌ల వినియోగం పైన విద్యార్థులతో మాట్లాడారు.

మెగా జాబ్‌మేళాకు తరలిరండి

మదనపల్లె : పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీ మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10వ తేదీన నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాకు నియోజకవర్గ వ్యాప్తంగా నిరుద్యోగులు తరలివచ్చి ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జాబ్‌మేళా విజయవంతంపై నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మదనపల్లె నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో ఎంపీ మిథున్‌రెడ్డి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఆక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, శ్యామ్‌సంగ్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమెజాన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ ప్రై.లిమిటెడ్, వొడాఫోన్ ఇండియా లిమిటెడ్, భారతి ఎయిర్‌టెల్ సర్వీస్ లిమిటెడ్ తదితర ప్రముఖ కంపెనీలు సుమారుగా 70 వరకు పాల్గొంటాయన్నారు. పదో తరగతి నుంచీ పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులకు వారి అర్హతలు, కమ్యూనికేషన్ స్కిల్, ఇతర నైపుణ్యాల ఆధారంగా నెలకు రూ.15,000 నుంచి రూ.40 వేల వరకు వేతనాలు లభించే ఉద్యోగాలకు జాబ్‌మేళాలో ఎంపిక ఉంటుందన్నారు. సుమారు 10,000 మంది వరకు ఉద్యోగాలు ఇచ్చేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మదనపల్లె నుంచే కాకుండా రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల నుంచి నిరుద్యోగులు హాజరవ్వవచ్చన్నారు. నియోజకవర్గంలోని ప్రతి సచివాలయంలో జాబ్‌మేళా దరఖాస్తులు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, సదాశివరెడ్డి, పోతబోలునాగరాజ, సర్పంచ్‌లు శరత్‌రెడ్డి, దండు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పసుపులేటి రమణ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా